

వైద్యులకు భద్రత కల్పించాలి

కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటన తీవ్రంగా కలచి వేసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో అధికారులు కూడా మేల్కొనాలి. మద్యం సేవించిన వారిని ప్రభుత్వాసుపత్రుల లోపలికి అనుమతించ కుండా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు సేవ చేయాలనే మేం వైద్య రంగంలోకి వచ్చాం. చనిపోయిన వారిని కూడా బతికించిన ఘటనలు ఉన్నాయి. అలాంటి ప్రాణదాతలకే రక్షణ లేకుంటే ఎలా?

– డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు, మాజీ సూపరింటెండెంట్, ప్రభుత్వాసుపత్రి, నిడదవోలు





ప్రాణదాతలపై దాడులు దారుణం

ఆపదలో ఉన్నవారికి ప్రాణాలు పోసే వైద్యులపై దాడులకు పాల్పడటాన్ని తీవ్ర నేరంగా పరిగణించాలి. ముఖ్యంగా మహిళా వైద్యులపై దాడులకు పాల్పడడం దారుణం. వైద్యులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఇటీవల కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్ హత్య వైద్య వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి చర్యలతో వైద్యులు తమ వృత్తికి సరైన న్యాయం చేయలేరు. ఆడపిల్లలు వైద్య వృత్తిలోకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఇది మంచి పరిణామం కాదు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి.

– టి.ఆంధ్రా, పీహెచ్‌సీ వైద్యాధికారి, తాడిమళ్ల

జంక్షన్‌కు మహర్దశ



నిడదవోలు స్టేషన్‌లో కొత్తగా నిర్మాణంలో ఉన్న 4, 5 నంబర్ల ప్లాట్‌ఫాంలు

- రైల్వేస్టేషన్‌లో కొత్తగా 4, 5 నంబర్ల ప్లాట్‌ఫాంల నిర్మాణం
- 45 మీటర్ల పొడవునా ఫుట్‌పాత్ బ్రిడ్జి, రెండు లిఫ్టుల నిర్మాణం
- ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం విస్తరణ
- చురుగ్గా నిడదవోలు స్టేషన్ అభివృద్ధి పనులు

నిడదవోలు: జంక్షన్ రైల్వే స్టేషన్ అయిన నిడదవోలుకు మహర్దశ పట్టింది. కీలకమైన స్టేషన్ సరికొత్త హంగులను సంతరించుకుంటోంది. అమృత్ భారత్ పథకం కింద దక్షిణమధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో అభివృద్ధి చేసేందుకు తొలి దశలో 11 రైల్వే స్టేషన్లకు ఎంపిక చేశారు. వాటిలో ఒకటైన నిడదవోలు రైల్వేస్టేషన్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించే పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈఏడాది డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ రైల్వే స్టేషన్లో ప్రస్తుతం ఒకటి, రెండు, మూడు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ స్టేషన్‌లో అదనంగా నాలుగు, ఐదో నంబర్ల ప్లాట్‌ఫాంల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మూడు ప్లాట్‌ఫాంల ఫ్లోర్ మొత్తం 200 మీటర్ల మేరకు గ్రానైట్‌తో ఆధునీకరిస్తారు. ప్లాట్‌ఫాంల్లోకి ప్రయాణికుల రాకపోకలకు వీలుగా రెండు లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ స్టేషన్లోని ఒకటి, రెండు, మూడు ప్లాట్‌ఫాంలకు చేరేందుకు ఒకే కాలినడక వంతెన ఉంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే క్రమంలో రాజమహేంద్రవరం వైపు ఆక్సిజన్ పార్కు వద్ద రూ.12 కోట్ల వ్యయంతో 45 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పున ఎండ్ టు ఎండ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఇరువైపులా పిల్లర్లు వేశారు. ఇక్కడే రెండు లిఫ్టులు, ఎస్కలేటర్ కూడా నిర్మిస్తారు. అంతేగాకుండా విద్యుత్ ఆధునీకరణ, ట్రావెలేటర్ సదుపాయాలు కల్పిస్తారు. ప్రయాణికులు సులభంగా గుర్తించేలా రాకపోకలకు సంకేతాలు, పార్కింగ్ ప్రదేశాలకు మార్గాల ఏర్పాట్లు, వ్యర్థాల నిర్వహణ, భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు.

రూ.6 కోట్లతో రెండు ప్లాట్‌ఫాంలు

ఈ స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న మూడు ప్లాట్‌ఫాంలకు అదనంగా రూ.6 కోట్ల వ్యయంతో 4, 5 నంబర్లతో కొత్తగా రెండు ప్లాట్‌ఫాంల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ నిర్మిస్తున్న ఫుట్‌పాత్ బ్రిడ్జి నుంచి ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి 2, 3, 4, 5 నంబర్ల ప్లాట్‌ఫాంలకు చేరుకోవచ్చు. ప్లాట్‌ఫాంల సంఖ్యను పెరగడంతో ఈ స్టేషన్ భవిష్యత్తులో మరిన్ని రైళ్ల రాకపోకలకు అనువుగా ఉంటుంది.

అత్యాధునిక టాయిలెట్లు

నిడదవోలు స్టేషన్‌లో రూ.1.90 కోట్ల వ్యయంతో అత్యాధునిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా జరగుతున్నాయి. ఇక్కడ మహిళలకు 8, పురుషులకు 8 మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు దివ్యాంగులకు రెండు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవడానికి విశాలమైన ఏసీ వెయిటింగ్ హాలు కూడా నిర్మిస్తున్నారు.

ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం విస్తరణ

ఈ స్టేషన్‌లో రూ.3.91 కోట్ల వ్యయంతో తాడేపల్లిగూడెం వైపు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం విస్తరణ పనులు జరుగుతున్నాయి. 600 మీటర్ల పొడవునా కాంక్రీటు, గ్రానైట్‌తో ప్లాట్‌ఫాంను ఆధునీకరిస్తున్నారు. ప్లాట్‌ఫాం రక్షణగోడ, అదనపు సదుపాయల పనులు కూడా జరుగుతున్నాయి. ఇదే ప్లాట్‌ఫాంలో రూ.3.28 కోట్ల వ్యయంతో 600 మీటర్ల పొడువునా ఆధునాతన షెడ్డు నిర్మిస్తున్నారు.

రోజుకు రూ.1.50 లక్షల ఆదాయం

నిడదవోలు రైల్వే జంక్షన్‌ను 1935లో బ్రిటిష్ హయంలో ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి నిత్యం వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. నిడదవోలు జంక్షన్ రైల్వే స్టేషన్ కావడంతో వివిధ రైళ్లు ఇక్కడి నుంచి భీమవరం, నరసాపురం, గుడివాడలకు మారతాయి. రోజూ ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు సరాసరిన 3,800 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ స్టేషన్ ప్రస్తుతం సి గ్రేడ్‌లో ఉంది. రోజుకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. రోజు 68 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ స్టేషన్ ఏజెన్సీ ముఖద్వారంగా ఉండడంతో జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి వంటి ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల వారే గాకుండా నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల ప్రయాణికులు కూడా ఎక్కడికి వెళ్లాలన్నా నిడదవోలు స్టేషన్‌కు రావాల్సిందే. ఈ స్టేషన్ మీదుగా రోజుకు 30 గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిడదవోలు పరిసర ప్రాంతాల నుంచి పలు వ్యాపార సంస్థలు గూడ్స్ రైళ్ల ద్వారా తమ సరకులను రవాణా చేస్తాయి. ప్రధానంగా ఎఫ్‌సీఐ గోడౌన్ నుంచి ధాన్యాన్ని ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నాయి. నిడదవోలు గూడ్స్ క్యాబిన్ నుంచి రోజూ ఎన్నో టన్నుల ధాన్యం ఎగుమతి అవుతుంది. ఈ రూపేణా రైల్వే శాఖకు నెలకు సుమారు రూ.కోటి ఆదాయం సమకూరుతోంది.



నిడదవోలు రైల్వేస్టేషన్ ముఖద్వారం



ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం విస్తరణ పనులు



ఆక్సిజన్ పార్కు వద్ద ఎండ్ టూ ఎండ్ ఫుట్‌పాత్ బ్రిడ్జి పిల్లర్లు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



నిడదవోలు మదన గోపాలస్వామి గుడిలో దీపారాధనను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ



కొవ్వూరు శ్రీరామానంద గౌడీయ మఠంలో రాధాకృష్ణులు



ఉండ్రాజవరం మండలం తాడిపర్రులోని రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారు

నిడదవోలు: శ్రీకృష్ణాష్టమి వేడుకలను పట్టణంలోని రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ మదన గోపాలస్వామి వారి ఆలయంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సందర్భంగా మహిళా భక్తులు ఏర్పాటు చేసిన దీపారాధనను ఆయన ప్రారంభించారు. ఆలయ మర్యాదలతో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, అర్చకులు గోవర్ధన దుర్గాప్రసాదాచార్యులు, గంగుల గోపీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రామానంద గౌడీయ మఠం ఆధ్వర్యంలో..

కొవ్వూరు: శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామానంద గౌడీయ మఠం ఆధ్వర్యంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ఉదయం శ్రీకృష్ణ లీలాస్తవ పారాయణ జరిగింది. శ్రీకృష్ణ జన్మ లీలలపై శ్రీమద్భక్తి ప్రమోద జనార్దన, శ్రీపాద రమణకృష్ణదాస్‌లు ఉపన్యసించారు. సాయంత్రం మల్లాది విరూపాలక్ష్మి శాస్త్రి, గుడివాక శ్రీనివాస్, మల్లాది కళ్యాణ్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో భజనలు జరిగాయి. అర్ధరాత్రి శ్రీకృష్ణ ఆవిర్భావంపై ఉపన్యాసాలు అందించారు. 28న శ్రీనంద మహారాజుల ఆనందోత్సవంతో ఈ మహోత్స వాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల వైష్ణవాలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తాడిపర్రు గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయం, ఉండ్రాజవరం కేశవస్వామి ఆలయాలతో పాటు పలు వైష్ణవ ఆలయాల వద్ద శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. భారీ ఎత్తున భక్తులు ఆలయాలను దర్శించారు. సాయత్రం ఆలయాల వద్ద యువకులు ఉట్టి కొట్టిన అనంతరం, స్వామివార్లను గ్రామ వీధులల్లో ఊరేగించారు.

పాఠశాలకు ప్రేమతో..!



దూబచర్ల హైస్కూల్‌కు రూ.40 వేల విలువైన ఇన్వర్టర్, ప్రింటర్‌ను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు



కలవచర్ల ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ సభ్యులు

నల్లజర్ల: పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించి ఆదర్శంగా నిలిచారు. దూబచర్ల జెడ్పీ హైస్కూల్ 1984–85 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో ఇటీవల సమావేశమయ్యారు. పాఠశాలకు తమ వంతు తోడ్పాటు అందించాలని తలచారు. అనుకున్నదే తడవుగా గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆగస్టు15న పిలిచి నగదు బహుమతులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాస్ చేసిన విజ్ఞప్తి మేరకు పూర్వ విద్యార్థులు రూ.40 వేల విలువైన ఇన్వర్టర్, కంప్యూటర్ ప్రింటర్‌లను మంగళవారం హెచ్‌ఎం బి.సుమతికి అందజేశారు. ఇదే బ్యాచ్ విద్యార్థిని, ప్రస్తుత లెక్కల ఉపాధ్యాయిని కాంత కుమారి 20 జతల స్పోర్ట్స్ యూనిఫాంను అందించ డానికి ముందుకు వచ్చారు. మరో విద్యార్థి కమల పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్లు అందిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో గుదే శ్యామ్, దొబ్బిడి సుందర్రావు, చవ్వాలకు ధర్మరాజు, ముంద్రు జయలక్ష్మి, కాంతకుమారి, శ్రీనివాసరావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కలవచర్లలో విద్యాసామగ్రి పంపిణీ

నిడదవోలు రూరల్: దాతలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులంతా ఉన్నతంగా చదవాలని విశ్రాంత ఎంఈఓ గాలి రాఘవయ్య అన్నారు. మండలంలోని కలవచర్ల ఎంపీపీ స్కూల్లోని 70 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ అధ్యక్షుడు రాచర్ల చైతన్యబాబు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు ఆరుగొల్లు వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో మంగళవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సలహాదారుడు ఇంజే శేఖర్, ఉపాధ్యక్షుడు గుబ్బల ప్రసాద్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పౌర వసతులపై ఇంత నిర్లక్ష్యమా?

- అధికారులను నిలదీసిన కౌన్సిల్ సభ్యులు
- తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్య వైఫల్యంపై అసంతృప్తి
- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చిత్రంలో చైర్ పర్సన్ రత్నకుమారి



సమావేశానికి హాజరైన సభ్యులు

కొవ్వూరు: పట్టణంలో తాగునీటి సమస్య, వీధిలైట్ల నిర్వహణలో నిర్లక్ష్యం, పారిశుధ్యాన్ని పట్టించుకోక పోవడంపై కౌన్సిల్ సభ్యులు మండి పడ్డారు. చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన మంగళవారం కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ప్రధాన అజెండాలోని 16, అనుబంధ అజెండాలోని రెండు అంశాలకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. మునిసిపల్ జేసీబీని అద్దె ప్రాతిపదికన బయటి వ్యక్తులకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు సభ్యులు అభ్యంతరం తెలిపారు. నెల పాటు ట్రయల్ రన్ చూసి ఈ ప్రక్రియను నిలిపి వేయాలని సభ్యులు కోరారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా సమావేశానికి హాజరయ్యారు.

సమస్యలపై సభ్యుల ఆగ్రహం

తాగునీరు కలుషితమై దుర్గంధంగా వస్తోందని, గత నెలలో మూడు రోజులు పట్టణంలో తాగునీటిని సరఫరా చేయలేక పోయారని 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు మండిపడ్డారు. కమిషనర్‌కు, ఇతర అధికారులకు ఫోన్ చేసినప్పటికీ, పట్టించుకోకపోవడంతో 'మీ కోసం'లో సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చానని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్ల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారని, పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉందని ఆయనన్నారు. మోటార్ కాలిపోవడంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చాయని చెప్పడం దుర్మార్గమన్నారు. అదనంగా ట్యాంకర్లు ఏర్పాటు చేసినప్పటికీ జగనన్న కాలనీల్లోకి రెండు, మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ పంపిస్తున్నారని ఆరోపించారు.

మా ఇళ్ల మీదకు వస్తున్నారు

వారానికి ఒక రోజు ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి సమస్య వస్తూనే ఉందని, జనం తమ ఇళ్లపైకి వస్తున్నారని చైర్ పర్సన్ రత్నకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆమె అన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 20న తాగునీటి సమస్యపై పట్టణానికి చెందిన ఓ న్యాయవాది కమిషనర్‌కు ఫోన్ చేస్తే తనకు ఫోన్ చేయవద్దని, సమస్య ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించడాన్ని తప్పుబట్టారు. రెండున్నర నెలలుగా తాగునీటి సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని నిలదీశారు. ఇంజినీరింగ్ అధికారులకు, కమిషనర్‌కు మధ్య సమన్వయం కనిపించడం లేదన్నారు. మూడు నెలల క్రితం పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ వద్ద గొయ్యి తవ్వి వదిలేస్తే కమిషనర్‌కు బాధ్యత లేదా..? అని మురళీకృష్ణ నిలదీశారు.

అంధకారం మాటున చోరీలు

ఏడో వార్డులో వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి పూట జనం ఇబ్బందులు పడుతున్నారని నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ నీలిమా ఆరోపించారు. సోమవారం రాత్రి తమ వార్డులో భారీ దొంగతనం జరిగిందన్నారు. వీధిలైట్లు వెలగని ప్రాంతాలనే చోరులు దొంగతనాలకు ఎంచుకుంటున్నారని ఆమె అన్నారు. టోల్‌గేట్ జంక్షన్ నుంచి ఔరంగాబాద్ వరకూ వీధిలైట్లు వెలగడం లేదని, రాత్రిపూట దొంగల భయంతో జనం ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ కందెల్లి రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవుట్ పాల్ డ్రెయిన్ మురుగునీరు దిగువకు వెళ్లకుండా అడ్డు కోవడంతో ఐదారు ఎకరాల్లోని వరి పంట ముంపు బారిన పడిందన్నారు.

మునిసిపాలిటీపై ప్రత్యేక దృష్టి పెడతా: ఎమ్మెల్యే

తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యలతో పాటు శివారు కాలనీల వాసులకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఎన్నికల ముందు నుంచీ పట్టణంలోని చాలా ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. బ్రిడ్జిపేటలో తాగునీరు కలుషితం కావడాన్ని తాను స్వయంగా చూశారన్నారు. లీకేజీలను అరికట్టకపోవడం, సక్రమంగా సరఫరా చేయకపోవడం వల్లే విమర్శలు వస్తున్నాయన్నారు. మీ ఇంట్లో తాగునీటి సమస్య వస్తే ఇలాగే స్పందిస్తారా? అని అధికారులను ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి ఏం అవసరమో సూచించాలని అధికారులను కోరారు. అవసరమైన చోట్ల కొత్త పైప్‌లైన్‌లను ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేయిస్తామని ప్రకటించారు. డంపింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

'బాలల కోసం భారత రాజ్యాగం'పై పోటీలు

దేవరపల్లి: 'బాలల కోసం భారత రాజ్యాగం' అనే అంశంపై మండలంలోని ప్రభుత్వ, ప్రవేట్ హైస్కూళ్లలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ విషయాన్ని మండల బాలోత్సవ కమిటీ సభ్యుడు ఉండవల్లి కృష్ణారావు తెలిపారు. మండలంలోని చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్లో మంగళవారం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో 86 మంది విద్యార్థులు పాల్గొనగా ఇ.లహరిక (ప్రథమ), కె. అభిషేక్ (ద్వితీయ), వై.సత్యశ్రీ (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారన్నారు. మండలంలో 18 హైస్కూళ్లు ఉండగా, 14 హైస్కూళ్లలో పోటీ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. 916 మంది విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్టు వివరించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు. ప్రతి పాఠశాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసినట్టు చెప్పారు. 42 మంది విజేతలకు బహుమతులు అందించినట్టు కృష్ణారావు తెలిపారు.

హిందీ టీచర్ రాజారత్నం మృతికి సంతాపం

దేవరపల్లి: గౌరీపట్నం సమీపంలోని దేచర్ల రోడ్డు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన గౌరీపట్నం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హిందీ టీచర్ రాజారత్నం మృతికి విద్యార్థులు సంతాపం తెలిపారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు టీచర్ రాజారత్నం చిత్ర పటాలను పట్టుకుని మౌనం పాటించారు. రాజారత్నం అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. పాఠశాల పూర్వపు విద్యార్థులు సంతాప సభ నిర్వహించారు. కుండా వినాయక విజయ్, ముప్పన సుధీర్, దుగ్గిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సర్పంచులు, కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు సూచించారు. పారిశుధ్య నిర్వహణపై సర్పంచులు, కార్యదర్శులు, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాన్నారు. ఎంపీడీఓ పి. ప్రభాకర రావు మాట్లాడుతూ రోడ్లపై చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. మురుగునీరు రోడ్లపై నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనందున మంచి నీటి సరఫరా, శానిటేషన్, డ్రైనేజీల నిర్వహణకు ఖర్చు చేయాలని సూచించారు. పారిశుధ్య పనులకు అంచనాలు తయారు చేసి, చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డీఎస్ఆర్ కుమారి, తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి, పలువురు సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు చాగల్లు మండల సమావేశం

చాగల్లు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.నిర్మలకుమారి మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలో అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు చిడిపిలో ఉచిత వైద్య శిబిరం

కొవ్వూరు: లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో చిడిపి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తారు. చిడిపి పంచాయతీ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు పుట్టిన రోజు సందర్భంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ మంగళవారం తెలిపారు. రాజమహేంద్రవరం లిటిల్ స్టార్ అండ్ షీ తల్లీ పిల్లల ఆసుపత్రి వైద్యులు శిబిరంలో రోగులకు సేవలు అందిస్తారన్నారు. చిన్న పిల్లల, స్త్రీ సంబంధిత, జనరల్ వ్యాధులకు చికిత్స అందిస్తారని చెప్పారు. కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ వంటి వ్యాధులకు కూడా చికిత్స అందిస్తామని తెలిపారు.

పిట్టల వేమవరంలో నేడు విగ్రహాల ప్రతిష్ఠ

ఉండ్రాజవరం/పెరవలి: పెరవలి మండలం పిట్టల వేమవరం గ్రామంలోని సీతారామ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 7 గంటలకు లక్ష్మీ గణపతి, జ్ఞాన సరస్వతీదేవి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత



హైస్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దాత దుగ్గిరాల రాంబాబు

గోపాలపురం: విద్యతో పాటు విద్యార్థులు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలని వర్జీనియా పొగాకు ఉత్తమ రైతు దుగ్గిరాల రాంబాబు అన్నారు. మండలంలోని వాదాలకుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రూ.20 వేల విలువైన క్రీడా సామగ్రిని మంగళవారం ఆయన అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పి.విజయకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

నల్లజర్లలో 29న వీహెచ్‌పీ షష్టిపూర్తి

నల్లజర్ల: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఏర్పాటై 60 ఏళ్ల పూర్తి కావస్తున్న సందర్భంగా నల్లజర్ల సోమాలమ్మ ఆలయం వద్ద ఈనెల 29న షష్టిపూర్తి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు జిల్లా కార్యదర్శి ముత్యాల గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం ఆయన నల్లజర్ల వచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షుడు వేణుగోపాలరాజు, పేరవరం గీతాశ్రమ పీఠాధిపతి సత్యానందగిరి స్వామి హాజరవుతారన్నారు. అన్ని భజన మండళ్ల సభ్యులు, ధార్మిక కమిటీల సభ్యులు హాజరు కావాలని వీహెచ్‌పీ మండల శాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్ కోరారు.